క్లుప్తంగా

తక్కువ వడ్డీకే బ్యాంకు రుణాలు



మాట్లాడుతున్న మేనేజర్ నాగార్జున

దెందులూరు: అతి తక్కువ వడ్డీ రేట్లతో అందించే వివిధ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని దెందులూరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ టి.నాగార్జున కోరారు. బుధవారం స్థానిక బ్యాంకు కార్యాలయంలో బ్యాంక్ అకౌంటెంట్ ఉప్పలపాటి రామకృష్ణతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. తమ ఖాతాదారులకు సీనియర్ సిటిజన్‌కు 8.6 అత్యధిక వడ్డీని ఫిక్స్ డిపాజిట్లపై అందిస్తున్నామని, ఏడాది కాలపరిమితికి రూ.500లకే ప్రమాద బీమా 10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఏడాది కాల పరిమితిలో రూ.వెయ్యి చెల్లించి పాలసీ తీసుకుంటే మృతుల కుటుంబానికి రూ.20 లక్షలు ఇన్సూరెన్స్ వర్తిస్తుందని వివరించారు.

సీపీఎం సభలపై ప్రచారం

గణపవరం: భీమవరంలో జనవరి 3, 4, 5 తేదీల్లో నిర్వహించే సీపీఎం పశ్చిమ గోదావరి జిల్లా 26వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జక్కంశెట్టి సత్యనారాయణ పిలుపు ఇచ్చారు. ఈ సభలపై బుధవారం గణపవరం మండలం కేశవరం, అప్పనపేట, మల్లపురాజుపేట గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా జక్కంశెట్టి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేసే సీపీఎం బలోపేతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్ రామకృష్ణ, ఎస్ సంజీవరావు పాల్గొన్నారు.

హనుమద్ వ్రతాలు

పెదవేగి : స్థానిక శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలో హనుమద్ వ్రతాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 6వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. తొలిరోజు స్వామి వారికి ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

ఆలయాల్లో పూజలు

దెందులూరు: స్థానిక విష్ణు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ధనుర్మాసం పురస్కరించుకుని 17వ రోజు కన్యలు స్వామివారికి నవనీత హారతి ఇచ్చారు. ఇలా చేయడంవల్ల కోరిన కోర్కులు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయంలో కమిటీ నాయకులు, గ్రామస్తులు, యువత సంయుక్తంగా నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారి పూజలు నిర్వహించారు. కేక్‌ను కట్ చేశారు.

దమ్ము చేలలో పక్షుల సందడి



వడ్డిగూడెం చేలలో సందడి చేస్తున్న పక్షులు

భీమడోలు: దాళ్వా పంట దమ్ములు ఊపందుకున్నాయి. దమ్ము చేస్తున్న చేలల్లో వచ్చే పురుగులను తింటూ పక్షులు కనువిందు చేస్తున్నారు. కొల్లేరుకు సమీపంలోని భోగాపురం, వడ్డిగూడెం, భీమడోలు, ఎంఎంపురం, సాయన్నపాలెం గ్రామాల్లో దమ్ము చేలల్లో పక్షులు ఆకట్టుకుంటున్నాయి.

స్వచ్ఛ భారత్ వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



స్వచ్ఛభారత్ వాకర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): స్వచ్ఛ భారత్ వాకర్స్ మానవ సేవే మాధవ సేవ అనే నినాదంతో పదేళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మధ్యాహ్నపు వెంకటేశ్వరరావు తెలిపారు. ఏలూరు పంపుల చెరువు వద్ద బుధవారం నిర్వహించిన అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా కల్లూరి చంద్రశేఖర్, చేకూరి వెంకటేశ్వరరావు, కోశాధికారిగా ఎస్ భాస్కరరావు, గౌరవ అధ్యక్షులుగా మధ్యాహ్నపు వెంకటేశ్వరరావు, కట్టా ఈశ్వర్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ వైఎస్ కనకారావు, ఉపాధ్యక్షులుగా బి.లక్ష్మణరావు, చిదరబోయిన శ్రీనివాసరావు, పసుపులేటి సత్యనారాయణ, సహాయ కార్యదర్శులుగా కాపా పాండురంగారావు, కొండేటి పోతురాజు, తలారి రాము, కమిటీ సభ్యులుగా ఎస్ భాస్కర్‌రావు, గల్లా శ్రీనివాసరావు, సముద్రాల కృష్ణమోహన్, గుబ్బల సత్యనారాయణ, మద్దిరాల రామలింగేశ్వరరావు, మధ్యాహ్నపు పద్మనాభం ఎన్నికయ్యారు.



గణపవరం : ఎంఈఓలకు శుభాకాంక్షలు చెబుతున్న ఉపాధ్యాయులు



ఉంగుటూరు : ఎంపీపీ, ఎంపీడీఓలకు శుభాకాంక్షలు తెలిపిన ఉద్యోగులు



భీమడోలు : ఆర్‌సీఎం చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఫాదర్లు ప్రదీప్, షింటోలు

కోలాహలంగా సంబరాలు

- న్యూ ఇయర్‌కు ఘన స్వాగతం
- కేక్ కటింగ్‌లు
- ఒకరికొకరు శుభాకాంక్షలు

న్యూ ఇయర్ సంబరాలు ప్రజలు కోలాహలంగా నిర్వహించారు. కేకులు కట్ చేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ ఏడాదంతా మంచే జరగాలని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, చర్చిల్లో ఆరాధనలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో వేడుకలు నిర్వహించారు. క్యాలెండర్లు, డైరీలు, పోస్టర్లను ఆవిష్కరించారు.

నిడమర్రు: బువ్వనపల్లిలోని మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు క్యాంపు కార్యాలయం బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వాసుబాబు తిరుమల తిరుపతి దర్శనం నిమిత్తం వెళ్లడంతో ఆయన సోదరుడు వైఎస్సార్ సీపీ నిడమర్రు మండల బాధ్యుడు పుప్పాల కన్నబాబు ఆధ్వర్యంలో న్యూ ఇయర్ కేక్ కట్ చేశారు. కన్నబాబు మాట్లాడుతూ నియోజకవర్గం ప్రజలు ఈ ఏడాది మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు సంకు శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ కిలారి సత్యవతి రవిబాబు, ఉపసర్పంచ్ వెల్లంకి నరేష్, అల్లుమోలు రంగారాం, గొట్టుముక్కల విశ్వనాధరాజు, మారిశెట్టి వెంకట్ తదితరలున్నారు.

అంతా మంచే జరగాలి

గణపవరం: నూతన సంవత్సర వేడుకలు బుధవారం ప్రజలు అట్టహాసంగా, ఆనందోత్సాహాలతో నిర్వహించుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కొత్తసంవత్సరంలో అంతా మంచే జరగాలని ఆకాంక్షించారు. ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మిలను ఎంపీడీఓ బేబీ శ్రీలక్ష్మి, తహసీల్దార్ అప్పారావు, ఏఓ యర్రంశెట్టి ప్రసాద్, ఎంఈఓలు రాజేష్, బాలయ్య తదితరులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీఓ, తహసీల్దార్లను సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తో హడావుడి.

ఉంగుటూరు: మండల కేంద్రమైన ఉంగుటూరులో న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజకీయ పార్టీల నేత ఇళ్ల వద్ద సందడి నెలకొంది. వైఎస్సార్‌సీపీ నేతలు బువనపల్లి వెళ్లి మాజీ ఎమ్మెల్యే వాసుబాబుకు క్యాంపు కార్యాలయం వద్ద వేడుకల్లో పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికార్లు నారాయపురం శివారులో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యే ధర్మరాజుకు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఎంపీడీఓ రాజీమనోజ్‌లను ఉద్యోగులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపి కేకు కట్ చేయించారు. తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాదుకు వీఆర్వోలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

భీమడోలులో ఘనంగా వేడుకలు

భీమడోలు: స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు మండే సుధాకర్ ఆధ్వర్యంలో పీఆర్‌టీయు వార్షిక క్యాలెండర్లు, డైరీలు, వాల్ పోస్టర్లను ఎంఈఓలు ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కర్ ఆవిష్కరించి మాట్లాడారు. విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ క్యాలెండర్ల, డైరీలను ఎంపీపీ కనుమాల రామయ్య, ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవీలు ఆవిష్కరించారు. సమాజంలో ఉపాధ్యాయులు ఉత్తమ సమాజ స్థాపనకు కృషి చేయాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి ఎం శరీన్, ఉపాధ్యాయులు వి.ఉపేంద్ర, శర్మ, వి.శేఖర్, సీఆర్‌పీలు సత్యప్రసాద్, ఎస్‌వీ రమణ, తదితరులు పాల్గొన్నారు.



బువ్వనపల్లిలో కేక్ కట్ చేస్తున్న పుప్పాల కన్నబాబు, వైఎస్సార్ సీపీ నేతలు



దెందులూరు : కేక్‌ను కట్ చేస్తున్న కామిరెడ్డి నాని

రానున్న కాలం వైఎస్సార్ సీపీదే

దెందులూరు: రానున్న కాలంలో వైఎస్సార్ సీపీకి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షులు కామిరెడ్డి నాని అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో శ్రీరామవరం పార్టీ నాయకులు కార్యకర్తలు నానిని కలిశారు. అనంతరం కేకును కట్ చేసి పార్టీ శ్రేణులకు నాని శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు తహసీల్దార్ బత్తుల సుమతి, ఎంపీడీఓ కె.శ్రీదేవి, కార్యాలయ సిబ్బంది తదితరులు బొకేలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

న్యూ ఇయర్‌కు ఘన స్వాగతం

పెదవేగి : 2025 సంవత్సరానికి ప్రజలు ఘనస్వాగతం పలికారు. హ్యాపీ న్యూ ఇయర్ అంటూ నినదించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. న్యాయంపల్లిలోని నడిపల్లి ఆర్‌సీఎం చర్చిలో విచారణ గురువు రాచూరి బాలస్వామి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సమస్త మానవాళి ఏసుక్రీస్తు చూపిన ప్రేమ, మార్గమే అనుసరణీయమన్నారు. కార్యక్రమంలో ఫాదర్ పెనుమాక జ్యనేష, సెయింట్ అలోసియస్ సుపీరియర్ సిస్టర్ మేరీ గ్రేస్, విశ్వాసులు పాల్గొన్నారు. విజయరాయిలోని కథోళిక సంఘం, బిలీవర్స్ ఈస్టర్న్ చర్చ్ ఆధ్వర్యంలో న్యూ ఇయర్ ప్రార్థనలు చేశారు. దెందులూరులోని హోలీగ్రేస్ మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్యాలెండర్‌లను పంపిణీ చేశారు. దైవసేవకులను సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

దేవునికి ఇష్టులుగా జీవించాలి

భీమడోలు: ప్రతి ఒక్కరూ దేవునికి ఇష్టులుగా జీవించాలని విజయరాయి ధ్యానాశ్రయం ఫాదర్ ప్రదీప్ అన్నారు. మండలంలోని ఆర్‌సీఎం, సీఎస్ఐ, రక్షణ సైన్యం, పెంతోకోస్తు, కల్వరి చర్చిలు, ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరాల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నూతన సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. చర్చిల్లో ప్రేమ విందులు ఏర్పాటుచేశారు. పేదలకు దుస్తులు పంచారు. భీమడోలు ఆర్‌సీఎం చర్చిలో విచారణ కర్త ఫాదర్ షింటో ఆధ్వర్యంలో ఫాదర్ ప్రదీప్ దివ్య పూజా బలిని సమర్పించారు. తొలుత కేక్ కట్ చేశారు. బాణసంచా కాల్చుతూ యువకులు, విశ్వాసులు, పెద్దలు కేరింతలు కొట్టా రు. కార్యక్రమంలో డీపాల్ ప్రిన్సిపాల్ ఫాదర్ నెల్సన్, ఫాదర్ జింటో, ఫాదర్ జిజో, కన్యస్త్రీలు, డీపాల్ విన్సెంట్ సొసైటీ సభ్యులు, పెద్దలు, జీసస్ యూత్, మరియదళ సభ్యులు, విశ్వాసులు పాల్గొన్నారు.



భీమడోలు : పీఆర్‌టీయూ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎంఈఓలు



భీమడోలు : యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎంపీపీ



పెదవేగి : ప్రత్యేక ఆరాధన చేస్తున్న హోలీగ్రేస్ పాస్టర్ రాజు



పెదవేగి : ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు

గ్రామాల్లో హైటెక్ హరిదాసు

గణపవరం: సంక్రాంతి రోజుల్లో సందడి చేసే హరిదాసులు మారుతున్న కాలంతో పాటు సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నారు. ఫలితంగా సాంకేతిక విప్లవం ముందు సంప్రదాయం వెలవెలబోతుంది. ప్రస్తుత సంక్రాంతి సీజన్‌లో ఏ గ్రామంలో చూసినా హైటెక్ హరిదాసులే కనిపిస్తున్నారు. మోటార్ సైకిల్‌కు మైక్ సెట్‌ను అమర్చి, రికార్డు చేసిన సంకీర్తనలు వినిపిస్తూ రయ్‌రయ్ మంటూ వీధులను చుట్టేస్తున్నారు. ఒక కూడలి వద్ద ఆగి కొంతసేపు పాటలు వినిపిస్తూంటే చుట్టుపక్కల మహిళలు బియ్యం, డబ్బులు, కూరగాయలు వంటివి తెచ్చి అక్షయ పాత్రలో వేసి వెళుతున్నారు. హరిదాసులకు నేడు ఆదరణ కరువైందని గణపవరం చుట్టుపక్కల గ్రామాల్లో తిరుగుతున్న కృష్ణాజిల్లాకు చెందిన శివయ్య ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాంతి తర్వాత తోపుడు బండిపై అరటిపండ్ల వ్యాపారం చేసుకుంటానని ఆయన తెలిపారు.



హరిదాసుకు బియ్యం వేస్తున్న యువతి

పాడి రైతులకు బహుమతులు



రైతులకు పాల క్యాన్లు అందజేస్తున్న భీమేశ్వరరావు

ద్వారకాతిరుమల : పాడి రైతులు మరింత పాల దిగుబడిని సాధించి ఆర్థిక స్వావలంబన పొందాలని వైఎస్సార్‌సీపీ మండల నేత, గ్రామ మాజీ సర్పంచ్ పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు సూచించారు. నూతన సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకుని మండలంలోని రామన్నగూడెంలో, తిరుమల డెయిరీ ఆధ్వర్యంలో పాలసేకరణ కేంద్రం వద్ద బుధవారం ఉదయం పాడి రైతుల సమావేశం నిర్వహించారు. అందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న భీమేశ్వరరావు చేతుల మీదుగా రైతులకు ప్రోత్సాహక బహుమతులుగా పాల క్యాన్లు, దాణా, మందులు, స్వీట్లు, కొత్త సంవత్సరం క్యాలెండర్లను అందజేశారు. ఈ సందర్భంగా భీమేశ్వరరావు మాట్లాడుతూ తిరుమల డెయిరీ అందిస్తున్న సహాయ సహకారాలను రైతులు సద్వినియోగం చేసుకొని, పాల దిగుబడులు పెంచుకోవాలని సూచించారు. రైతులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యాలు



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన ఆధ్యాత్మిక, కూచిపూడి నృత్య కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. ఉదయం 10 గంటల నుంచి స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం సాయంకాల పూజలు నిర్వహించారు. 5 గంటలకు నగరానికి చెందిన సప్పా భారతి భాగవతారిణి భీష్మ ప్రతిజ్ఞ అనే అంశంపై హరికథా కాలక్షేపం చేశారు. రాత్రి 7 గంటల నుంచి కె.స్వర్ణలత శిష్యబృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు, కోసూరి సత్యనారాయణాచార్యులు, వేద పండితులు యనమండ్ర వేంకట రవిప్రకాష్ శర్మావధాని విశేష పూజలు చేయగా, బ్రహ్మోత్సవ యాజ్ఞీకులు జీఎవీ దీక్షితులు, కిళాంబి వెంకట పవన్ కృష్ణమాచార్యులు యాగాదులు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

జూదరుల అరెస్ట్

భీమడోలు: కోరుకొల్లులో కోడి పందాల శిబిరంపై బుధవారం భీమడోలు పోలీసులు దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రూ.2200 నగదుతో పాటు ఒక కోడి, ఒక కత్తిని స్వాధీనం చేసుకున్నారు. భీమడోలులోని ఆరుంధతీ కాలనీలో సాయంత్రం పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రూ.9700లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై వై.సుధాకర్ తెలిపారు. ఇదిలా ఉండగా.. పూళ్లలో రైల్వే ఉద్యోగి ఇంటిలో చోరీ జరిగింది. బీరువా పగల కొట్టి రూ.1.60 లక్షల విలువ చేసే బంగారు, వెండి వస్తువులను దొంగలో దోచుకెళ్లినట్టు సమాచారం.

శ్రీవారి పథకాలకు విరాళం

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదానం పథకానికి ఏలూరుకు చెందిన శ్రీనివాస్ రూ.2,21,000, గోసంరక్షణ పథకానికి రూ.2,21,000, హైదరాబాద్‌కు చెందిన కర్రి అప్పిరెడ్డి నిత్యాన్నదాన పథకానికి రూ.1,01,116 ఆలయ కార్యాలయంలో జమచేశారు.

ఉన్ని దుస్తులకు భలే గిరాకీ

- చలిని తట్టుకునేందుకు ఉన్ని వస్త్రాలపై ప్రజల దృష్టి
- ఇటీవల పెరిగిన చలి తీవ్రత

భీమడోలు: చలికాలం వచ్చిందంటే చాలు గజగజ వణికించే చలిని తట్టుకునేందుకు అన్ని దుస్తులు ధరించాల్సిందే. చలి ఉధృతి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రతి ఒక్కరూ ఉన్ని దుస్తులను వేసుకోవాలి. సాయంత్రం 5 నుంచి మరసటి రోజు ఉదయం 9 గంటల వరకు చలి ప్రభావం తగ్గడం లేదు. కొన్ని రోజుల క్రితం వర్షాలు కురవడంతో చలి ప్రభావం పెద్దగా లేదు. కొన్ని రోజులుగా రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. దీనితో చలితో ప్రజలు వణికిపోతున్నారు. చలి, మంచు నుంచి ఉపశమనం పొందేందుకు పిల్లల నుంచి వృద్ధుల వరకు ఈ వస్త్రాలు బాగా ఉపకరిస్తాయి. దీనితో ఉన్ని దుస్తులకు డిమాండ్ పెరుగుతుంది. దీనితో వ్యాపారాలు జోరందుకున్నాయి. ఎక్కువగా మంకీ టోపీలు, మఫ్లర్లు, ఉన్ని స్వెట్టర్లకు గిరాకీ పెరిగింది. భీమడోలు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ఉన్ని దుస్తుల విక్రయాలు మరింత జోరందుకున్నారు. మధ్య తరగతి నుంచి సాధారణ ప్రజలకు ఈ దుకాణం వద్ద అన్ని రకాల ఉన్ని వస్త్రాలు లభ్యమవుతుండడంతో జనం ఎగబడుతున్నారు. గతం కన్నా ఈ ఏడాది వ్యాపారాలు ఆశాజనకంగా లేవని వ్యాపారులు అంటున్నారు. ప్రజల వద్ద కూడా డబ్బులు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో అవసరమైన వాటిని కొనుగోలు చేస్తున్నారు. పెద్దలు, మహిళలు, పిల్లల కోసం ఉలెన్ జర్కిన్లు, మంకీ టోపీలు, రగ్గులు, శాలువాలు, మఫ్లర్లు వంటివి కొనుగోలు చేస్తున్నారు. ఒక్కొక్కటి రూ.300 నుంచి రూ.3 వేల వరకు ఉన్ని వస్త్రాలు వాటి నాణ్యత ఆధారంగా లభ్యమవుతున్నాయి. రెయిన్ కోట్లు, మంకీ టోపీలు, స్వెట్టర్లు, దుప్పట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. స్వెట్టర్లు రూ.400 నుంచి రూ.600, మంకీ టోపీలు రూ.100 నుంచి రూ.150, దుప్పట్లు రూ.350 నుంచి రూ.1,300 వరకు పలుకుతోందని కొనుగోలు దారులు అంటున్నారు. కొన్ని నెలలుగా మధ్యప్రదేశ్‌కు చెందిన యువకులు ఇక్కడ దుకాణాన్ని ఏర్పాటు చేసుకుని జీవనోపాధిని కొనసాగిస్తున్నారు.



భీమడోలు జంక్షన్‌లో ఉన్న ఉన్ని దుస్తుల దుకాణం



ఆకర్షణీయంగా స్వెట్టర్లు

కొన్ని రోజులుగా చలి పెరిగింది



కొన్ని రోజులుగా చలి పెరిగింది. దీనితో ఉన్ని వస్త్రాల విక్రయాలు ఊపందుకున్నాయి. ఈ ఏడాది గతేడాది కన్నా చలి తక్కువగా ఉంది. చలి పెరిగితేనే మా వ్యాపారం జరుగుతుంది. ఉన్ని వస్త్రాలు కొనుగోలు చేసేందుకు ప్రజలు అంతగా ముందుకు రావడం లేదు. మరో రెండు నెలల పాటు ఇక్కడ ఉంటాం. నవంబర్ నుంచి అమ్మకాలు ప్రారంభించాం.

– ప్రకాష్, మధ్యప్రదేశ్, వ్యాపారి